క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కొవ్వూరు: పట్టణంలో శుక్రవారం 33/11కేవీ విద్యుత్ స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని నిడదవోలు డివిజన్ ఈఈ ఎస్ నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.11కేవీ జూనియర్ కళాశాల ఫీడర్‌పై ఉన్న మూడు డాబాల వారి వీధి, ఐసీఐసీ బ్యాంకు వీధి, జూనియర్ కళాశాల రోడ్డు ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

నల్లజర్ల: మండలంలోని పోతినీడుపాలెం సబ్ స్టేషన్ పరిధిలో టౌన్ ఫీడర్‌లో చెట్టుకొమ్మలు తొలగింపు, లైన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పోతినీడుపాలెం, చాదరాశిగుంటలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యస్.నారాయణ అప్పారావు తెలిపారు.

నిడదవోలు రూరల్: మండలంలోని బసివిరెడ్డిపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని సమిశ్రగూడెం, అట్లపాడులో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఈనెల 25వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు గురువారం పేర్కొన్నారు.

ఉండ్రాజవరం: ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం పాలంగి సబ్‌స్టేషన్ పరిధిలో చివటం గ్రామానికి శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్లు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.నారాయణ అప్పారావు గురువారం తెలిపారు.

బ్రాహ్మణగూడెంలో అన్న సమారాధన

చాగల్లు: దేవీనవరాత్రి ఉత్సవాలు ముగింపులో భాగంగా బ్రాహ్మణగూడెంలో రావులచెరువు గట్టు మీద ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో గురువారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్న సమారాధనలో బ్రాహ్మణగూడెం, ఎస్ ముప్పవరం, గరప్పాడు, దారవరం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

పెరవలి: మానవ అక్రమ రవాణాను నిరోధించటం అందరి బాధ్యత అని సీడీపీఓ డి శ్రీలక్ష్మి తెలిపారు. పెరవలి ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ టీచర్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజ్వల ఎన్‌జీఓ కోఆర్డినేటర్ శ్రావ్యశ్రుతి మాట్లాడుతూ మహిళలను, బాలికలను మోసపూరిత మాటలతో మీకు సినిమా, ఉద్యోగం వేయిస్తానని చెప్పి వీరిని అక్రమంగా రవాణా చేస్తున్నారని దీనిని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి ఐక్య రాజ్యసమితి కృషి

కొవ్వూరు: ప్రపంచ శాంతిని కాపాడడం కోసం ఐక్యరాజ్య సమితి చేస్తున్న కృషి ప్రశంసనీయమని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి వీరవెంకటసత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రిస్టియన్ పేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐక్యరాజ్య సమితి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో శాంతి ప్రతిజ్ఞ చేయించారు. అధ్యక్షుడు సత్యనారాయణ, పెనుమాక జయరాజుల ఆర్థిక సాయంతో విద్యార్థులకు పౌష్టిహికారం అందజేశారు.ఎండీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దేవరపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శంకుస్థాపన చేశారు. దేవరపల్లి మెయిన్ రోడ్డు నుంచి దళిత వాడలోని అంబేడ్కర్ సెంటర్ వరకు రూ.1.09 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్లకు, సీబీఎస్ కాలనీలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, టుబాకో బోర్డు నుంచి వెంకటేశ్వర కాలనీలో రూ. 25 లక్షల వ్యయంతో నిర్మిచనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే వెంకట్రాజు శంకుస్థాపన చేశారు. వీటితోపాటు గౌరీపట్నంలో ధుమంతునిగూడెం, దుద్దుకూరు, గౌరీపట్నం, కృష్ణంపాలెం, లక్ష్మీపురం, రామన్నపాలెం, త్యాజంపూడిలో నిర్మించనున్న సీసీ రోడ్లకు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే వెంకట్రాజు శంకుస్థాపన చేశారు. దేవరపల్లి సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి. సువర్ణరాజు పాల్గొన్నారు.

డీవైఈఓ నారాయణ బదిలీ

కంబాలచెరువు: రాజమహేంద్రవరం డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న ఈవీవీఎస్ ఎస్ఎస్‌బీఎల్ నారాయణ పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అక్కడ పాఠశాల విద్యాశాఖాధికారి (పూర్తి అదనపు బాధ్యతలు)గా ఆయన పనిచేయనున్నారు. ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి (ఎఫ్ఏసీ)గా కాకినాడ ఆర్‌జేడీ జి.నాగమణి వ్యవహరిస్తున్నారు.

కుట్టు శిక్షణ.. ఉపాధికి ఊతం

- స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు శిక్షణ
- మూడు నెలల్లో మూడు బ్యాచ్‌లుగా 60 మందికి శిక్షణ
- ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలు


శిక్షణలో మెళకువలు నేర్చుకుంటున్న మహిళలు


కుట్టు అంశాలను విశదీకరిస్తున్న టీచర్ కృష్ణవేణి

నల్లజర్ల: ఇంటికే పరిమితమై, ప్రతి చిన్న ఆర్థిక అవసరానికి ఇంటి పెద్దపై, భర్తపై ఆధారపడాల్సిన పరిస్థితిని గతంలో ఎదుర్కొన్న మహిళలు నేడు ఆర్థిక స్వావలంబన సాధన దిశగా పయనిస్తున్నారు. ఓ స్వచ్ఛంద సంస్థ కల్పించిన అవకాశం కారణంగా మహిళల్లో స్వతంత్రంగా జీవించగలమన్న ఆత్మవిశ్వాసాన్ని నింపింది. నైపుణ్యం, స్వయం సమృద్ధి సాధించి కుటుంబ పోషణలో కీలక పాత్ర పోషించగలుగుతామన్న ధీమాను వారంతా వ్యక్తం చేస్తున్నారు. దీనికి నల్లజర్ల మండలంలోని పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు దోహదపడ్డారు. ఆయన మహిళలకు, యువతులకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇప్పించడమే కాకుండా వీరందరికీ వివిధ బ్యాంకుతో మాట్లాడి కుట్టుమిషన్లు అందించే ఏర్పాటు చేస్తున్నారు. మహిళలు ఆర్థికంగా నిలవాలనే లక్ష్యంతో గతేడాది దేవరపల్లి మండలం యర్నగూడెంలో 4బ్యాచ్‌లకు, నల్లజర్లలో ఈఏడాది మూడు బ్యాచ్‌లకు ట్రస్ట్ సౌజన్యంతో వివిధ రకాల దుస్తులు కుట్టడంలో ఒక్కో బ్యాచ్‌కు మూడు నెలలు పాటు శిక్షణ అందించే ఏర్పాటు చేశారు. ఇందులో కొంతమంది దివ్యాంగులు ఉన్నారు. శిక్షణ పూర్తయిన వారికి పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ధ్రువపత్రం అందించనున్నారు. ఇలా శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తున్నారు.

15 ఏళ్లుగా కుట్టు శిక్షణ



నేను 15 ఏళ్లుగా మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నాను. కేవలం మూడు నెలల్లోనే థియరీతో పాటు మహిళల అన్ని రకాల దుస్తులు కటింగ్ చేసి కుట్టగలిగే స్థాయికి తీసుకువస్తున్నాం. ఇలా ఎంతో మందికి కుట్టుశిక్షణలో మెళకువలు నేర్పించాను.
– పి.కృష్ణవేణి, కుట్టుశిక్షణ టీచర్, నల్లజర్ల

ఆసక్తిగా నేర్చుకుంటున్నా



చేతిలో పనితనం ఉంటే ఏనాటికైౖ నా పనికొస్తుంది.నేను చదువుకోలేదు. కుటుంబానికి ఆసరాగా ఉంటుందని ఆసక్తిగా పట్టుదలతో టైలరింగ్ నేర్చుకుంటున్నాను. అన్నిరకాల దుస్తులు కుట్టడం, కత్తిరించడం నేర్చుకుంటున్నాను. స్వయం ఉపాధితో రాణించగలననే భరోసా ఏర్పడింది. – వై.కుమారి, నల్లజర్ల

కుట్టు పనితో ఆర్థిక చేయూత



కుట్టుశిక్షణలో చేరి కొద్ది రోజులే అయినా కొలతలు, మార్కింగ్ చేయడం వంటి పనులను, తగిన రీతిలో కుట్టడం నేర్చుకున్నాను. శిక్షణ పూర్తయ్యాక ఇంటివద్దే కుట్టుపని చేస్తూ ఇంటి పోషణకు ఆర్థిక చేయూతగా ఉంటా.
– డి.లలిత రాణి, ఘంటావారిగూడెం

270 మందికి కుట్టుశిక్షణ



పార్డ్ ఇండియా సంస్థ ద్వారా యర్నగూడెం, నల్లజర్లలో సంవత్సరంన్నర కాలంగా 270 మంది మహిళలు, యువతకు కుట్టు శిక్షణనిచ్చాం. ఈ శిక్షణకు హైదరాబాదుకు చెందిన జయం ఛారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం అందిస్తోంది. పేద విద్యార్థులకు బడి తర్వాత చదువు చెప్పే కార్యక్రమం. వేసవిలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, మెరిట్ విద్యార్థులకు స్కాలర్ షిప్పులు అందిస్తున్నాం. పేదలకు కంటి వైద్య, ఆరోగ్య వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాం.
– అంబటి శ్రీనివాసరావు, పార్డ్ ఇండియా సంస్థ అధ్యక్షుడు

భూ సమస్యల పరిష్కారానికి కృషి


విజ్జేశ్వరం గ్రామసభలో రీసర్వే అభ్యంతరాలపై మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు నాయక్

నిడదవోలు రూరల్: గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభ ద్వారా కృషి చేస్తున్నామని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ తెలిపారు. మండలంలోని విజ్జేశ్వరంలో రీసర్వేలో వచ్చిన భూ సమస్యలపై వినతుల స్వీకరణకు గ్రామసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు నాయక్ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఇప్పటి వరకు 52 రీసర్వే అభ్యంతరాలు వచ్చాయన్నారు. వాటి పరిష్కారానికి రెవెన్యూ, సర్వే అధికారులు దృష్టిపెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిక్కా శ్రీనివాస్, రీసర్వే డీటీ బి.ప్రదీప్‌కుమార్, వీఆర్వో వాసు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దేవరపల్లి పీఆర్ ఏఈగా వినోద్

దేవరపల్లి: మండల పంచాయతీ అసిస్టెంట్ ఇంజనీర్‌గా వినోద్ నియమితులయ్యారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. నల్లజర్ల మండలం నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఆయన పూర్తి అదనపు బాధ్యతలతో ఇక్కడ నియమితులయ్యారు. గతంలో ఆయన ఇక్కడ ఏఈగా కొంతకాలం పనిచేసి నల్లజర్ల బదిలీపై వెళ్లారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జిగా గ్రామ సచివాలయం అసిస్టెంట్ ఏఈగా పనిచేస్తున్న షాజహాన్ విధులు నిర్వహించారు.

మహిళలకు సబ్సిడీతో రుణాలు


తాళ్లపూడిలో స్వయం సహాయక సంఘాలకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

తాళ్లపూడి: స్వయం సహాయక సంఘాల మహిళలందరూ పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి ప్రభుత్వం పీఎం ఈజీపీ, పీఎం ఎఫ్ఎం పథకాల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు అందిస్తోందని జిల్లా లఘు పరిశ్రమల అభివృద్ధి, జిల్లా బ్యాంక్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. తాళ్లపూడి లోని డీఆర్‌డీఏ సెర్ప్ కార్యాలయంలో గురువారం ఏపీఎం మంగాయమ్మ ఆధ్వర్యంలో మహిళలకు రుణ సౌకర్యం కల్పించే కార్యక్రమంపై వీవోలకు, సీసీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు అవగాహన కల్పించి, యూనిట్లను ఎంపిక చేయాలని సూచించారు. ఎంపిక చేసే యూనిట్ల వల్ల మహిళల జీవన విధానంలో మార్పు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ మేనేజర్ వెంకటయ్య, ఫీల్డ్ ఆఫీసర్ అనిల్, డీపీఎం హేమంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం


తాళ్లపూడిలో సమాచార హక్కుచట్టంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి

తాళ్లపూడి: రైతులు సమాచార హక్కుచట్టంపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి జి రుచిత అన్నారు. తాళ్లపూడిలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సమాచార హక్కు చట్టం- 2005పై రైతులకు మండలస్థాయిలో సదస్సు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో రుచిత మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం విధి విధానాలు దానిని సక్రమంగా వినియోగించుకునే మార్గాలను వివరించారు. తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రతి పౌరుడూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ నిర్మల, ఎంఈవో 2 సీహెచ్ నెహ్రూజీ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలి

నిడదవోలు రూరల్: గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె వనం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటేందుకు పంచాయతీ పరిధిలోని ఖాళీ స్థలాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కె.శ్రీనివాస్‌రెడ్డి, టి.గోపాలకృష్ణ, కేవీ సుబ్బన్న, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు సిద్ధం


ఉండ్రాజవరంలో ధాన్యం సేకరణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉండ్రాజవరం: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ విషయంలో రైస్ మిల్లర్లకు, రైతులకు మధ్య వారధిలా సిబ్బంది పనిచేయాలని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ సిబ్బందికి సూచించారు. ఉండ్రాజవరం వెలుగు కార్యాలయంలో గురువారం ధాన్యం సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు సంబంధించి సిబ్బంది ముందస్తు చర్యలతో రైతులకు ఎంటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. గోనె సంచులు, తేమ, రవాణా, ప్లాస్టిక్ బరకాలతో పాటు వర్షాలు కురిసే అవకాశం ఉంటే జట్టు కూలీలను పెట్టింపు చేసుకోవాలన్నారు. ఏవో ఎం.విశ్వాసరావు మాట్లాడుతూ నవంబర్ 1వ తేదీ నుంచి మండలంలో ధాన్యం సేకరణ ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.రామారావు, సీఎస్‌డీ టీఎస్ సుధీర్‌రెడ్డి, రైస్ మిల్లర్స్, వీఆర్వోలు, సొసైటీ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

ఆహార అలవాట్లతోనే క్యాన్సర్ ముప్పు

కంబాలచెరువు: మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన శైలితోనే దేశంలో క్యాన్సర్ వ్యాధి పెరుగుతోందని చంద్రకళ సూపర్ స్పెషాలిటీ సర్జికల్ క్యాన్సర్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పట్నాల విశ్వనాథ్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వీఎల్ పురం చైతన్య జూనియర్ కళాశాలలో గురువారం చైల్డ్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పట్నాల విశ్వనాథ్ మాట్లాడుతూ చిన్న పిల్లలు సెల్‌ఫోన్ ఎక్కువగా వాడడం వల్ల రేడియేషన్ కారణంగా క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. ఏడు రకాల క్యాన్సర్లను నివారించే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను చిన్న వయసులో ఇవ్వడం ద్వారా క్యాన్సర్‌ను అరికట్టవచ్చన్నారు. సభకు అధ్యక్షత వహించిన లయన్ మద్దుల వీఎస్ శ్రీరామగుప్తా మాట్లాడుతూ తమ క్లబ్ ద్వారా ప్రతి నెలా కళాశాల లేదా పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. చైతన్య కళాశాల ఏజీఎం కె.గోవిందరాజు, చైతన్య ప్రిన్సిపాల్ లక్ష్మణ్, క్లబ్ అడ్మిన్, గ్రంధి వసంత కుమారి, కార్యదర్శి వెన్న కుమార స్వామి, ట్రెజెరర్ ఉలగంటి రాఘవరావు, క్లబ్ మాజీ అధ్యక్షుడు మాధవరావు పాల్గొన్నారు.

సోమాలమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న వీరంశెట్టి ప్రసన్నకుమార్

నల్లజర్ల: స్థానిక గ్రామ దేవత సోమాలమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి తేజ అగ్రి ఏజెన్సీస్ అధినేత వీరంశెట్టి ప్రసన్నకుమార్, శ్యామల దంపతులు రూ.1,01,116 గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అక్కడ ఉంటున్న అయ్యప్పపీఠం భక్తులకు రూ.25వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొమ్మిరెడ్డి గాంధీ, అయ్యప్పస్వాముల గురుస్వామి గుంటముక్కల శ్రీరామకృష్ణ, బలుసు శ్రీనివాసరావు, సవలం రామకృష్ణ, గన్నిన నాగేశ్వరావు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి ఎల్‌వోసీ పత్రాలు అందజేత

నిడదవోలు : నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న నలుగురు బాధితులకు గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో రూ. 13.58 లక్షల ఎల్‌వోసీ పత్రాలను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ బాధితులకు అందజేశారు. దీనిలో భాగంగా నిడదవోలు మండలం పెండ్యాల గ్రామానికి చెందిన విప్పర్తి శ్రీనుకు రూ.1.08 లక్షలు, తాడిమల్ల గ్రామానికి చెందిన సింగులూరి విజయలక్ష్మికి రూ. 5 లక్షలు, పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన గంటా నాగ వెంకట సుబ్రహ్మణ్యంకు రూ. 1.50 లక్షలు, కానూరు గ్రామానికి చెందిన వీరమల్లు రాంబాబుకు రూ. 6 లక్షల ఎల్‌వోసీ పత్రాలు మంత్రి దుర్గేష్ అందజేశారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి


శిబిరంలో రక్తదానం చేస్తున్న పోలీసు అధికారులు

కొవ్వూరు: ప్రమాదాల బారిన క్షతగాత్రులు ఎంతో మంది రక్తం సకాలంలో అందక మృతి చెందుతున్నారని, రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావాలని డీఎస్పీ జి.దేవకుమార్ పేర్కొన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో గురువారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. డీఎస్పీ ఈ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డీఎస్పీ దేవకుమార్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి రక్తదాన నిధికి పోలీసు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయబాబు, రూరల్ ఎస్సై కె.శ్రీహరి రావు,గోపాలపురం ఎస్సై కె.సతీష్ కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు జె.శ్రీనివాసరావు, సత్యనారాయణలతో పాటు ఇతర సిబ్బంది పలువురు స్థానిక యువకులు రక్తదానం చేశారు.ఆసుపత్రి సూపరిండెంటెండ్ సాయికిరణ్,జనసేన పట్టణ అధ్యక్షుడు దేగల రాము,ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీల్లో ఆధిపత్య పోరు.. ఉద్యోగులు విలవిల

పెరవలి: నిడదవోలు నియోజకవర్గంలో కూటమి నాయకుల ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరడంతో వీరి మధ్య ప్రభుత్వ ఉద్యోగులు అడ్డకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నారు. ఇప్పటికే జనసేన, టీడీపీకి చెందిన అధినాయకులు గ్రామ స్థాయి నుంచి మండలస్థాయి అధికారులను బదిలీ చేసినా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉద్యోగులు పట్టుమని 10 రోజులు కాకుండానే వారిని మళ్లీ బదిలీ చేయటానికి రంగం సిద్ధం చేస్తున్నారు. పెరవలి మండలంలో వారం రోజుల క్రితం పెరవలి ఎస్సై, నిడదవోలు సీఐపై సస్పెన్షన్ వేటు పడితే అదే రోజు సాయంత్రం కొత్త ఎస్సైని జిల్లా ఎస్పీ నియమించారు. అంత వరకు బాగానే ఉన్నా తీరా చార్జి తీసుకున్న తరువాత మరో ఎస్సైని నియమించాలని నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఎస్పీకి సిఫార్సు లేఖ ఇవ్వడంతో చార్జి తీసుకున్న ఎస్సై తీవ్ర మనస్థాపానికి గురైనట్టు తెలిసింది. ప్రస్తుతం ఎస్సైని ఉద్యోగం చేయనిస్తారా లేక వేరే చోటుకి బదిలీపై పంపిస్తారా అన్నది వేచి చూడాల్సి ఉంది. ఇప్పటికే పెరవలి మండలంలో ఎంపీడీఓ, 18 గ్రామ పంచాయతీలకు 8 మంది కార్యదర్శులు లేరు. తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసల్దార్ బదిలీపై వెళ్లినా కొత్తవారు రాలేదు. దీనికంతటికీ కారణం ఇక్కడ నెలకొన్న గందరగోళ పరిస్థితులే కారణమని పలువురు విమర్శిస్తున్నారు. వివిధ గ్రామాలకు వీఆర్వోలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దిగువస్థాయి ఉద్యోగుల బదిలీలపై కూడా కూటమి నాయకులు ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఉదాహరణకు ఖండవల్లిలో ఏఎన్ఎంను బదిలీ చేయాలని స్థానిక కూటమి నాయకులు ఇప్పటికే అధికారుల వద్దకు వెళ్లి ఒత్తిడి చేస్తున్నారు. ఈ ఏఎన్ఎం 6 నెలల క్రితం నరసాపురం నుంచి ఖండవల్లికి బదిలీపై వచ్చారు. ఈమె తన పనితీరుకు ఉత్తమ ఏఎన్ఎంగా జిల్లాస్థాయి అవార్డు తీసుకున్నారు. ఈమె ఓ ప్రజాప్రతినిధికి భార్య కావటమే దీనికంతటికీ కారణమని అనుకుంటున్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

నిడదవోలు : కార్తీక మాసం పురస్కరించుకుని నిడదవోలు డిపో నుంచి పంచారామాలకు, శబరిమలై యాత్రలకు ప్రత్యేక బస్ సర్వీసులు నడుపుతున్నట్లు నిడదవోలు ఆర్టీసీ డీఎం కె. వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో శబరిమలైకు బస్‌లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి సోమవారం ఏకదశ రుద్రులు, అష్ట సోమేశ్వరాలయాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. పంచరామాలకు వెళ్లే పల్లె వెలుగు బస్సుకు టికెట్ ధర రూ.700, ఏకదశ రుద్రులు, అష్ట సోమేశ్వరాలయాలకు రూ.350, అప్పయ్య భక్తులకు ఐదు రోజుల ప్యాకేజీ కింద రూ.4,600, ఏడు రోజులకు రూ.5,600, పది రోజులకు 7,500 రూపాయలతో సూపర్ లగ్జరీ బస్సులను సమకూర్చుతామని డీఎం వెంకటేశ్వరరావు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కానూరు విద్యార్థి ఎంపిక


కానూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

పెరవలి: పెరవలి మండలం కానూరు ఉన్నత పాఠశాల విద్యార్థి ఏ సుశాంత్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రామాంజనేయులు తెలిపారు. 9వ తరగతి చదువుతున్న సుశాంత్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో రాణించటంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని, నవంబర్ 9,10 తేదీల్లో బాపట్లలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. సుశాంత్‌ను గురువారం పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీలు అభినందించారు.

కబడ్డీ పోటీలకు లోకేష్ ఎంపిక


పాటంశెట్టి లోకేష్

నిడదవోలు : తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి పాటంశెట్టి లోకేష్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్ -17 విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్థానిక ఏకేఆర్‌జీ హైస్కూల్ ప్రిన్సిపాల్ జి. పద్మజ, పీఈటీ పి. కృష్ణారావు తెలిపారు. ఈమేరకు గురువారం లోకేష్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.